

నేడు డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మించిన డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ కేంద్రాన్ని ఈ నెల 14వ తేదీ శుక్రవారం నాడు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం లేక ప్రజలు ఇప్పటి వరకూ రాజమండ్రి, ఏలూరు వెళ్లేవారు. గతేడాది భీమవరం, తణుకులో డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కిడ్నీ రోగులకు కొంత ఇబ్బంది తగ్గినా ఆ రెండు కేంద్రాల్లో రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో ఇబ్బందులు తప్పేవి కావు. ఎట్టకేలకు మంత్రి రామానాయుడు కృషితో డయాలసిస్ కేంద్రం మంజూరైంది. మూడు నెలలుగా నిర్విరామంగా పనులు చేయడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

నీళ్లివ్వరు.. నీడ చూపరు..!

మండుటెండలో ఉపాధి హామీ కూలీలు విలవిల

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధి హామీ కూలీలు మండుటెండలో మలమల మాడిపోతున్నారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచే ఎండ తీవ్రత పెరగడంతో పని ప్రదేశాల్లో పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నీడ కోసం ఇవ్వాల్సిన పరదాలు మూడేళ్లపాటు ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కన్పించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం గ్రామాల్లో అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. కూలీలకు సక్రమంగా వంద రోజులు కూడా పనులు కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇక వేసవి తీవ్రత నేపథ్యంలో మజ్జిగ, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయడంతోపాటు సమ్మర్ అలవెన్స్ అందించాల్సి ఉంది. రెండు పూటలా పని విధానం, ముఖ ఆధారిత హాజరు విధానాలను కూలీలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉపాధి కూలీలు చేసిన పనులకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉండటం గోరుచుట్టుపై రోకలిపోటులా ఉందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పందిళ్లు వేసుకోవాలంట..!

మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కాలువల పనులు చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 12 వరకు పని చేయాలని అధికారులు సూచిస్తున్నారు. జీవీల గ్రామాల్లో చలువ పందిళ్లు వేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఏపిఒలకు ఆదేశాలు వచ్చాయి. కర్రలు, గడ్డి, తాటి కొమ్మలు ఎక్కడ నుంచి తెచ్చుకోవాలని ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. పైగా టెంట్లు ఇస్తే పని ప్రదేశంలో వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దానికి భిన్నంగా పందిళ్లు అంటే వేరే పని ప్రదేశాలకు తరలించేది ఎలాగని ప్రశ్నిస్తున్నారు.



ఏలూరుపాడు గ్రామంలో ఊర చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గతంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవేవీ ఇవ్వడం లేదు. తాగునీటిని కూడా ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని కూలీలు వాపోతున్నారు. కాళ్ల మండలంలో 5,815 మంది జాబ్‌కార్డులు ఉన్నాయి. పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అందని వేతనాలు

ఉపాధి కూలీలకు చేసిన పనులకు సంబంధించిన కూలి సొమ్ము చాలా రోజులుగా చెల్లించలేదు. మండలంలో కూలీలకు రూ.56 లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 15 రోజులకు ఒకసారి చెల్లించాల్సిన బిల్లులు రెండు నెలలు గడిచినా అందకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధుల విడుదలలో జాప్యంతో సమస్య వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

వాసా విజయ్ మణికంఠకుమార్, టెక్నికల్ అసిస్టెంట్, కాళ్ల

ఎండ తీవ్రత నుంచి ఊరట పొందడానికి పని ప్రదేశంలో పందిళ్లు వేసుకోవాలని ఆదేశాలొచ్చాయి. ఈ మేరకు క్షేత్ర సహాయకులకు తెలియజేశాం. కూలీలు ఎండ దెబ్బ గురికాకుండా, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.

15న తణుకులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివాస్

పాల్గొనున్న సిఎం చంద్రబాబు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారాన్ని 'స్వచ్ఛ ఆంధ్ర' దినోత్సవంగా ప్రకటించి ప్రతినెలా ఒక్కో జిల్లాను ఎంపిక చేసి సిఎం చంద్రబాబు పాల్గొంటారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 15న తణుకు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. స్వచ్ఛ ఆంధ్ర సూచికల ఆధారంగా పారిశుధ్య చర్యలను సమగ్రవంతంగా అమలు చేయడం, పర్యవేక్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ, విద్య, ఆరోగ్య, రవాణా, సంక్షేమ శాఖలు సహా కీలక ప్రభుత్వ విభాగాలు భాగస్వాములుగా చేపట్టారన్నారు. స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం కింద పట్టణాలు, గ్రామాలు, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్వాడీలు, మార్కెట్లు, రైలు, బస్ స్టేషన్లు, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడతారన్నారు. జిల్లా నోడల్ అధికారిగా సిపిఒ వ్యవహరిస్తున్నారు. ఈ నెల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తణుకు పట్టణంలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వినియోగ వస్తువుల ప్రోత్సాహం' అనే థీమ్‌తో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కొత్త కౌలు చట్టం తీసుకురావాలి

ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - పోడూరు


కౌలురైతుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలురైతుల చట్టాన్ని వెంటనే అసెంబ్లీలో పెట్టి ఆమోదించాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కొత్త చట్టం వెంటనే తీసుకురావాలని కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంటనమోదు కౌలురైతుల పేరున చేసి పంటరుణాలు, నష్ట పరిహారం కౌలురైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన సంతకాలు సేకరించి సిఎంకు పంపాలని స్థానిక తహశీల్దార్లకు అందజేస్తున్నామన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కెవివి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు పంపన నాగరాజు, కౌలురైతులు బండి శ్రీనివాస్, ఇంజేటి శేఖర్, బూరాడి శ్రీనివాసరావు, కోట తాగూర్, సరెళ్ల ఇజ్రాయేలు, ఉండ్రు రంగారావు, నక్కా శ్యామ్‌సుందరం, కుసుమే రమేష్, ఇంజేటి రాజేష్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కౌలు రైతులు

పేదల ఇళ్లు తొలగించాలని చూస్తే ఊరుకోం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ - ఆరో రోజు కొనసాగిన ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర



పాలకోడేరు : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అక్రమంగా తొలగించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని, ఆధిపత్య ధోరణిని సిపిఎం అడ్డుకుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర గురువారం ఆరో రోజు పాలకోడేరు మండలంలోకి ప్రవేశించింది. పాలకోడేరు శివారు ఎఎస్ఆర్‌నగర్‌లో సిపిఎం బృందం ఇళ్ల తొలగింపు బాధితులతో మాట్లాడింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నా పేదలకు నేటికీ జానెడు జాగా లేని పరిస్థితి ఉండడంపై పాలకులు సిగ్గుపడాలన్నారు. సెంటున్నర స్థలం ఇచ్చి రూ.లక్షల్లో అప్పుల పాల్జేసిన ఘనత పాలకులదే అన్నారు. ఉండి నియోజకవర్గంలో స్థానిక ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు కాలుష్యం, అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను అక్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఎఎస్ఆర్ నగర్‌లో నివశిస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా ఆ ఇళ్లు తొలగించాలని చూస్తున్నారని తెలిపారు. అదే కాలనీకి ఆనుకుని ఉన్న సుమారు తొమ్మిదిన్నర ఎకరాల భూమి భూస్వాముల చేతుల్లో ఉందన్నారు. ప్రభుత్వ భూమి భూస్వాములు, పెత్తందారులు ఆక్రమించుకుంటే ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు కన్పించదా అని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో ఆధిపత్య చెలాయిస్తే చూస్తూ ఊరుకోమని, పేదలందరూ ఐక్యంగా తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. నిజమైన అభివృద్ధి కావాలంటే నియోజకవర్గంలో భూస్వాములు, పెత్తందారులు, సంపన్నుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, అంతేగాని అమాయకులైన పేదలపై మీ జులుం తగదని అన్నారు. తొలుత శృంగవృక్షం సెంటర్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నేతలు వై.రాము, మల్లిపూడి ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్నాడ మెయిన్ సెంటర్లో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహామూర్తి, జిల్లా కమిటీ సభ్యులు గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, ఇంజేటి శ్రీనివాస్, నాయకులు మల్లిపూడి ఆంజనేయులు, షేక్ వలీ, బత్తుల విజయ్‌కుమార్, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, నేత దున్న మరియమ్మ పాల్గొన్నారు.

వీరవాసరం : గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రభుత్వం కదిలొచ్చే వరకూ పోరాటం సాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, జగనన్న లేఅవుట్లలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ఎజెండాగా సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర గురువారం వీరవాసరం మండలం మీదుగా సాగింది. నవుడూరులో ప్రారంభమైన యాత్ర కొణితివాడ, బుధారాయుడుచెరువు, వీరవాసరం గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల లబ్ధిదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. వీరవాసరం కేంద్రంగా జీవనం సాగిస్తున్న తమకు ఐదు కిలోమీటర్ల దూరంలో బాలేపల్లిలో నివాసయోగ్యం కాని ప్రాంతంలో స్థలాలిచ్చారని వాపోయారు. స్థలం తీసుకోకపోతే ఆధార్, రేషన్‌కార్డులు రద్దవుతాయని బెదిరించి తమకు స్థలాలు అంటగట్టారని వాపోయారు. ఇదే విధంగా వీరవాసరంలో ఇచ్చిన స్థలాల్లో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని మరికొందరు చెప్పారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ నివాసయోగ్యం కాని బాలేపల్లిలో ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దు చేసి వీరవాసరంలోనే స్థలాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పించిందని, దానిని పునరుద్ధరించాలని కోరారు. ఒక కుటుంబంలో ఎంతమంది అర్హులున్న కుమారులున్నారో వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అందుకు అనుగుణంగా నిబంధనలు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొర్రా ఆలమహరాజు, బాలం విజయకుమార్, జుత్తిగ నరసింహమూర్తి, బాలం విజయకుమార్, పోతుల మృత్యుంజయ పాల్గొన్నారు.



వీరవాసరంలో లబ్ధిదారుల నుండి వినతులు స్వీకరిస్తున్న నేతలు

పని భారం తగ్గించాలని కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యాన గురువారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలనలో అత్యవసరమైన 26 రకాల రోజువారీ విధులు, సచివాలయం ద్వారా ఇస్తున్న వివిధ రకాల సర్వేల వల్ల తమపై పని భారం ఎక్కువగా ఉంటుందన్నారు. సెలవు రోజుల్లో కూడా గ్రామ పంచాయతీలో అత్యవసర పనులకు హాజరు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేల భారం బాగా ఎక్కువగా ఉందన్నారు. పని భారం తగ్గించాలని, సెలవు రోజుల్లో అత్యవసర పనులకు మినహా మిగిలిన పనుల్లో కార్యదర్శులను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిట్టిబాబు, నేతలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ప్లాస్టిక్ సంచులను నిషేధించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 15న తణుకులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి కొనసాగింపుగా తణుకులో నిర్వహిస్తున్న థీమ్‌లో భాగంగా 'సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వినియోగ వస్తువుల ప్రోత్సాహకం' దశలవారీగా అమలు చేస్తామని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ముఖ్యంగా 100 మైక్రాన్లు మందం కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ 19 వస్తువులను మానేయాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని తెలిపారు. గురువారం తణుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. రాబోయే రోజుల్లో తణుకులో ప్లాస్టిక్ నిషేధించడంతోపాటు దుకాణాల్లో వ్యాపారులు వినియోగించే ప్లాస్టిక్ సంచుల స్థానంలో బయోడీగ్రేడబుల్ సంచులు వినియోగించేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. తణుకులో ప్లాస్టిక్ నిషేధానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల్లో, పరిశ్రమల్లో ఇలా ప్రతిచోటా పరిశుభ్రత, పారిశుధ్యానికి ప్రాముఖ్యత ఇవ్వడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు . ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజావేదిక, అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని, అనంతరం జిల్లా అధికారులో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యర్థాలు నేరుగా డ్రెయిన్లోకి వదలొద్దు

హోటళ్ల యజమానులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - నరసాపురం

హోటళ్ల నుంచి వ్యర్థాలను డ్రెయిన్లోకి నేరుగా పంపకుండా మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటనలో భాగంగా హోటళ్ల వ్యర్థాలు డ్రెయిన్లలోకి నేరుగా రావడం గమనించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హోటల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా వ్యర్థాలను డ్రెయిన్లోకి పంపే మార్గంలో మెస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేంద్ర ప్రసాద్, పాత్రుడు శానిటరీ మేస్త్రీ కిషోర్, నరేష్ పాల్గొన్నారు.

మే 31 నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మే 31 నాటికి 6,319 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గృహనిర్మాణ శాఖాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గృహనిర్మాణ శాఖాధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఇళ్ల నిర్మాణం ఆమె సమీక్షించారు. మే 31 నాటికి 9,107 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉండగా నేటికి 2,788 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇంకా సుమారు 6,319 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని విడుదల చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. జిల్లాలో ఎస్‌సి లబ్ధిదారులు 5,593 మంది, ఎస్‌టి లబ్ధిదారులు 385 మంది, బిసి లబ్ధిదారులు 11,362 మంది మొత్తం 18,340 మంది ఉన్నారని, వీరికి అదనపు ప్రయోజనం రూ.92.66 కోట్లు లబ్ధి చేకూరనుందని తెలిపారు. గూగుల్ మీట్‌లో జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య, హౌసింగ్ ఇఇలు, డిఇలు పాల్గొన్నారు.

శక్తి టీమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ ఆదేశాలతో డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద సారథ్యంలో డివిజనల్ స్థాయిలో శక్తి టీమ్ ఏర్పాటు చేశారు. ఈ శక్తి టీమ్ యాప్‌ను మహిళలంతా డౌన్‌లోడ్ చేసుకుని వారికి ఏ విధమైన రక్షణ అవసరమైన వెంటనే ఆ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని డిఎస్‌పి శ్రీవేద అన్నారు. శక్తి టీమ్‌ను నరసాపురం టౌన్ ఎస్ఐ జయలక్ష్మి పర్యవేక్షిస్తారన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో ఆకతాయిలను, ర్యాగింగ్ చేసే యువకులను శక్తి టీమ్ అరికడుతుందన్నారు. ప్రతి స్కూల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తామని తెలిపారు. నరసాపురం డివిజన్ స్థాయిలో గురువారం శక్తి టీమ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నరసాపురం టౌన్ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, కానిస్టేబుళ్లు వి.మౌనిక, కె.నాగేశ్వరి, ఎన్.దివ్య, జి.రాంబాబు, కె.దుర్గానాగ కుమార్, డి.నరేంద్ర పాల్గొన్నారు.



సబ్ డివిజన్ శక్తి టీమ్‌తో డిఎస్‌పి శ్రీవేద

24 నుండి నాటిక పోటీలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 24 నుండి వీరవాసరం కళాపరిషత్ ఆధ్వర్యంలో అఖిలభారతస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిక పోటీలు కరోనా, ఇతర కారణాల వల్ల కొన్ని సంవత్సరాలుగా నిర్వహించలేకపోయామన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల పోటీలను కొనసాగించాలని కళాపరిషత్ కార్యవర్గం నిర్ణయించిందన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో ఎనిమిది నాటికలు ప్రదర్శించడంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులను, విద్యావేత్తలను, ఇతర రంగాల ప్రముఖులను, కళాకారులను సత్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పాలా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఆకుల లీలాకృష్ణ, గుండా మురళీకృష్ణ పాల్గొన్నారు.

వీరవాసరంలో సాగునీటి ఎద్దడి

పీర్లకోడు బోదె ఆక్రమణల ఫలితం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. వీరవాసరం-మత్స్యపురి మార్గంలో సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు తగినంత అందడం లేదు. దీంతో అక్కడ ఆయకట్టు రైతులు ఇంజిన్లతో సాగునీటిని తోడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాణికోడు నుండి మురుగునీటిని తోడుకుని తమ పంట పొలాలకు మళ్లించుకుంటున్నారు. వీరవాసరం పశ్చిమ పంటకాల్వ నుండి పిల్ల కాల్వ ద్వారా పీర్లకోడు బోదె గుండా ఈ ప్రాంత ఆయకట్టుకు సాగునీరు పారుదల సదుపాయం ఉంది. అయితే పీర్లకోడు బోదె చినపేట నివాసాల ప్రాంతం ఆక్రమణలకు గురవ్వడం వల్ల సాగునీరు సక్రమంగా పారుదల కావడం లేదని రైతులు అంటున్నారు. వంతులవారీ విధానంలో కూడా ఈ ప్రాంత ఆయకట్టుకు అంతంత మాత్రంగానే సాగు నీరు అందుతోంది. వచ్చిన కొద్దిపాటి నీరు ఎగువ భాగంలోని ఆయకట్టు రైతులు తోడుకోవడంతో తమ వరకు రావడం లేదని కౌలురైతు కాగిత శ్రీనివాసరావు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మురుగుకాల్వల్లోని నీటిని ఇంజిన్లతో తోడుకుని పంటను కాపాడుకుంటున్నామన్నారు. పీర్లకోడు బోదె నివాస ప్రాంతాల వద్ద ఆక్రమణలకు గురవ్వడం, దీనికి తోడు ఇళ్లలో మురుగునీరు, మరుగుదొడ్ల నీరు పంట బోదెలోకి వదిలేస్తుండటంతో ఉపాధి కూలీలు ఈ బోదె తవ్వకంలో ఇబ్బందులు పడుతున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ తెలిపారు. మిగిలిన బోదెను పూర్తిస్థాయిలో తవ్వడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంత ఆయకట్టుకు అయితే అతివృష్టి లేదా అనావృష్టిగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. సార్వాసాగు సమయంలో ముంపునకు గురవుతుందని, దాళ్వాలో సాగు ప్రారంభించిన నాటి నుండి నీటి కష్టాలు ప్రారంభమవుతాయని రైతులు తెలిపారు. కొంతమంది రైతులు సుమారు వెయ్యి అడుగుల దూరంలో ఉన్న రాణికోడు వద్ద నుండి పైపులు వేసి ఇంజిన్లతో నీరు తోడుకుంటున్నామని, సాధారణ ఖర్చులకు అదనంగా సాగునీరు తోడుకోవడానికి రూ.20 వేలు అదనంగా ఖర్చు చేస్తున్నామని కౌలు రైతు శ్రీనివాసరావు తెలిపారు. సాగుకు ప్రతిబంధకంగా ఉన్న పరిస్థితులను తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వీరవాసరంలో ఇంజిన్‌తో నీరు తోడుకుంటున్న రైతులు

స్వర్ణలతకు ఝాన్సీ లక్ష్మీబాయి సూపర్ ఉమెన్ అవార్డు

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ అధినేత డాక్టర్ డిఆర్.స్వర్ణలతకు ఝాన్సీ లక్ష్మీబాయి సూపర్ ఉమెన్ (2025) అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం హైదరాబాదులోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీ కొమ్మూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత డాక్టర్ కె.శ్రీనివాస్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా స్వర్ణలత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి సూపర్ ఉమెన్ అవార్డు రావడం ఆనందంగా ఉందని, అదే సమయంలో సమాజం పట్ల మరింత బాధ్యత పెంచిందని అన్నారు. సమాజానికి ఝాన్సీ లక్ష్మీబాయి అందించిన సేవలు మరుపు రానివన్నారు. ఈ అవార్డు తీసుకోవడం జీవితంలో మరిచిపోలేనిదన్నారు.



అవార్డు అందుకుంటున్న స్వర్ణలత

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఎంఇఒ 2 పి.రామకృష్ణ



ప్రజాశక్తి - పెనుగొండ

పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని ఎంఇఒ 2 పి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్నాయని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతున్నారని తెలిపారు. జెడ్‌పిహెచ్ జిల్లా పరిషత్ స్కూల్ ఇలపర్రులో బాలురు 23 మంది, బాలికలు 39 మంది మొత్తం విద్యార్థులు 62 మంది, వడలిలో బాలురు 27 మంది బాలికలు 34 మంది మొత్తం 61 మంది విద్యార్థులు, దేవలో బాలురు 30 మంది, బాలికలు 41 మంది మొత్తం విద్యార్థులు 71 మంది విద్యార్థులు, చెరుకువాడలో బాలురు 41 మంది బాలికలు 36 మంది మొత్తం 77 మంది, సిద్ధాంతం బాలురు 48 మంది, బాలికలు 50 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఎపిఎస్‌పి విజర్ బాలికల ఉన్నత పాఠశాలకు సంబంధించి 50 మంది, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బాలికలు 79 మంది, తదితర పాఠశాలలకు గాను ఈ సంవత్సరం 965 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ గతం కంటే ఎక్కువ ఉత్తీర్ణత పెరగాలని ఆయా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని ఎంఇఒ తెలిపారు. ఇప్పటికే ఆయా స్కూళ్లకు హాల్ టికెట్లు అందజేసినట్లు తెలిపారు. పరీక్షా సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

చిన్న చిన్న జాగ్రత్తలతో 'పది'ంతల ఫలితాలు

చిట్‌చాట్



ఎంఇఒ ఎ.ఉషారాణి

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిలో పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 440 మంది, రెండు ప్రయివేటు పాఠశాలల్లో 56 మంది విద్యార్థులు మొత్తం 496 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి ఉపాధ్యాయులు విద్యార్థులచే పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వివిధ పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా గ్రేడ్‌ల వారీగా విడదీసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు బెంచీలు, డస్కులు, తాగునీరు, విద్యుత్తు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పౌష్టికాహారం.. నిద్ర తప్పనిసరి..

పరీక్షల వేళ విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురికావడం సహజమని, పోటీతత్వంతో పాటు తల్లిదండ్రుల ఆశయంతో ఒత్తిడికి మరింత పెంచుతుంటున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టడం మూలంగా తిండిపై ధ్యాస తగ్గిపోతుందన్నారు. దీని ఫలితంగా నీరసం, కళ్ల తిరగడం, నిద్రలేమి ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు పిల్లల ఆహార విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్యం సక్రమంగా ఉంటే విద్యార్థులు తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని ఆమె వివరించారు.

ఏకాగ్రత ముఖ్యం...

విద్యార్థులు రోజూ ఎక్కువగా నీరు తాగాలని, 10 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని తెలిపారు. శీతల పానీయాలు తీసుకోవడం వల్ల అందులోని ఆమ్లాలు ఏకాగ్రతకు భంగం కలిగిస్తాయని ఎంఇఒ తెలిపారు. కారం, మసాలాలు ఉన్న ఆహారం తగ్గించాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలన్నారు. ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. నీరసంగా ఉన్నప్పుడు కొబ్బరినీళ్లు తీసుకోవడం శ్రేయస్కరమన్నారు.

ఇవి చేస్తే మేలు..

పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు రోజుకు 300 మిల్లీ లీటర్ల కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్ నీరు, మజ్జిగ తీసుకోవాలని, నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ, బత్తాయి రసం ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. అన్నం గంజి లేదా బార్లీ గంజిని సాయంత్రం వేళ 200 మిల్లీ లీటర్లు తీసుకోవాలని, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, సమయానికి తినడం, నిద్రపోవడం చేయాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు చదువుకోవాలని, ఏకధాటిగా చదవకుండా విశ్రాంతి తీసుకుంటూ చదవడం వల్ల మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతంగా చదువుకున్నప్పుడే మంచి ఫలితాలు సాధించొచ్చని ఆమె సూచించారు.

15న ఎస్ఆర్‌కెఆర్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 15వ తేదీ శనివారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. గురువారం ఆయన కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాల్లో కళాశాల వార్షికోత్సవ వివరాలను మీడియాకు వివరించారు. వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణ నిశాంత్ వర్మలతో పాటు యాజమాన్య ప్రతినిధులు కూడా హాజరవుతున్నారన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్డులోని దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దత్త సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

15న పెనుమంట్ర మండల సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: ఈ నెల 15వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు కెవిఎన్.రెడ్డి (వాసు) అధ్యక్షతన జరగనుందని ఎంపిడిఒ పి.సామ్యూల్ తెలిపారు. ఈ సమావేశం ముందు ఉదయం 11 గంటలకు అని, అనివార్య కారణాల వల్ల సాయంత్రం 4 గంటలకు మార్చినట్లు తెలిపారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రెస్టారెంట్లలో తనిఖీలు

వీరవాసరం : వీరవాసరం పలు రెస్టారెంట్లలో సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేష్ రాజు గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సెవెన్ స్పైస్, మోహన కృష్ణ, ప్యారడైజ్ రెస్టారెంట్లలో నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్టు గుర్తించారు. ఆయా రెస్టారెంట్ల నుంచి తొమ్మిది గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీరిపై 6ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేశామని ఆర్ఐ తెలిపారు.

దోమల ద్వారా వచ్చే రోగాలను అరికట్టాలి

గణపవరం: దోమల ద్వారా వచ్చే రోగాలను అరికట్టాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. గురువారం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అప్పన్నపేట, కేశవరం గ్రామాల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీనా కార్యక్రమంలో పాల్గొని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గురించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా వ్యాధులను అరికట్టొచ్చని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి తొట్టెలను శుభ్రం చేసి ఆరబెట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి శాంతరత్నం, ఎంఎల్‌హెచ్‌పిలు దుర్గారావు, ప్రేమ, జ్యోతి, శాంతి, ప్రశాంతి పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలని పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు తెలిపారు. పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సరిపల్లిలోని కామాక్షి క్లినిక్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్లు మాట్లాడుతూ మూత్ర పిండాల వ్యాధి ఉన్నవారు శీతల పానీయాలు మానేయాలన్నారు. 45 నిమిషాలు నడవాలని సూచించారు. మండల అధ్యక్షులు సత్యనారాయణ మూర్తి మాట్లాడారు. ఈ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఆహార నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కెటిఎన్.సత్యనారాయణ, కోశాధికారి కొటకల అప్పారావు, ఇసి సభ్యులు మస్తాన్ వల్లి పాల్గొన్నారు.

చారిత్రక చిత్ర వైభవం గ్రంథ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి రాష్ట్ర కార్యదర్శి, రచయిత వైట్ల కిషోర్ కుమార్ రాసిన 'చారిత్రక చిత్ర వైభవం' గ్రంథాన్ని హైదరాబాద్ రవీంద్ర భారతిలో యువకళా వాహిని ఆధ్వర్యంలో ప్రఖ్యాత సినీనటి, నాట్యాచారిణి ప్రభ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలో వచ్చిన అద్భుత చారిత్రక చిత్ర విశేషాలను గ్రంథస్తం చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. మన చరిత్రలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, తెలుగులో ఎక్కువగా చారిత్రక చిత్రాల్లో నటించే అవకాశం రావడం అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత వైట్ల కిషోర్ కుమార్‌ను అభినందించారు. అనంతరం నటీమణి ప్రభ పుష్ప గుచ్ఛం అందించి, శాలువతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ గ్రంథాన్ని సినీ విజ్ఞాన విశారద ఎస్‌వి.రామారావు, మాణికేశ్వరి దంపతులకు అంకితం ఇచ్చారు. అనంతరం రచయత వైట్ల కిషోర్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో చారిత్రక చిత్రాలు తక్కువగా వచ్చాయి, నేటి యువతరానికి మన చరిత్ర, చారిత్రక వీరుల గొప్పతనం తెలిసేలా సినిమా అనే పవర్‌ఫుల్ మాధ్యమం ద్వారా అందరికీ తెలియజేయాలని, మరిన్ని చారిత్రాత్మక చిత్రాలు తెరకెక్కాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సినీ విజ్ఞాన విశారద ఎస్‌వి.రామారావు దంపతులు, ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ నటులు సుబ్బరాయశర్మ, యువ కళావాహిని అధ్యక్షులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'పది' గెలుపునకు తొలిమెట్టు : ఎంఇఒ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పదో తరగతి గెలుపునకు తొలిమెట్టు అని ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి పబ్లిక్ పరీక్షలకు సాధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ అన్నారు. స్థానిక సుబ్బారావు పేట వాణి పబ్లిక్ స్కూల్లో గురువారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల అవగాహన సదస్సు విజయీభవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. గత సంవత్సరం 591 అత్యధిక మార్కులతో టౌన్ రికార్డ్ సాధించిన వాణి స్కూల్ విద్యార్థులు ప్రస్తుత సంవత్సరంలో కూడా ఉత్తీర్ణతలో జిల్లాను ప్రథమ స్థానంలో తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు గ్రహీత వాణి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వాణి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి తగ్గించుకొని పరీక్షలు రాసి అత్యధిక మార్కులు సాధించాలన్నారు.

అంతర్జాతీయ సదస్సు విజయవంతం

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెం ఉద్యాన పరిశోధనా స్థానంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు విజయవంతమైందని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, రాంభూటాన్, అబ్లు, ప్యాషన్ ఫ్రూట్, ఫిగ్, మాంగో స్టీన్, లిచ్చి, దురైన్, స్టార్ ఫ్రూట్ వంటి విదేశీ పండ్లు, ఆర్కిడ్స్, డైసీ, డాఫోడిల్, లోటస్, తులిప్ తదితర విదేశీ రకాలు మన రాష్ట్రంలో సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు దిగుమతులు తగ్గి విదేశీ మారకద్రవ్యం నిలిచి ఉంటుందన్నారు. ఈ క్రమంలో అన్యదేశ పంటలను ప్రోత్సహించేందుకు పిజిపిఆర్ ఆసియా సొసైటీ సహకారంతో తగిన పరిశోధనలు ప్రారంభించి రైతులకు అందిస్తామని తెలిపారు. పిజిపిఆర్ ఆసియా సొసైటీ ఛైర్మన్ ఎంఎస్.రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు పామాయిల్, కోకో వంటివి అన్యదేశ పంటలే అయినప్పటికీ, ఇప్పుడు అవి స్వదేశీ పంటల కంటే ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చేవిగా ఉన్నాయన్నారు. వియత్నాం ప్రొఫెసర్ నోగ్యన్ థాయ్ గల్ తమ దేశంలో ఒకప్పుడు కేవలం అరటి ఎగుమతులు మాత్రమే ఉండేవని, ఆదాయం అంతంత మాత్రమే ఉండేదని, ఆ సమయంలో వియత్నాం ప్రభుత్వం అన్యదేశ పంటలు ప్రోత్సహించడం ద్వారా ఇప్పుడు తమ రైతుల ఆదాయం చాలా పెరిగింది, ఎగుమతులు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, ఎల్.నారం నాయుడు డీన్ ఆఫ్ హార్టికల్చర్, పరిశోధనా సంచాలకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

పాడి రైతులందరూ మూగజీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డిడి జవహర్ హుస్సేన్ సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని వారతిప్ప గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో మాట్లాడారు. గ్రామంలో ఉన్న 93 మూగజీవాలకు టీకాలు వేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యులు ఇంజేటి సురేంద్ర, సిబ్బంది ఉన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో సకాలంలో స్పందించి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని వైఎస్.పాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల మాజీ అధ్యక్షులు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించి సకాలంలో వారి సమస్యలు పరిష్కరిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. వీధికో బెల్ట్ షాప్, మండలానికి ఒక పేకాట క్లబ్ ఏర్పాటు చేయడం అభివృద్ధి చేయడమా అని కూనపరెడ్డి ప్రశ్నించారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడే మంచి అభివృద్ధి పనులు చేసి అధికారులు, కూటమి నాయకులు ప్రజల మన్ననలు పొందాలని కూటమి నాయకులకు సూచించారు. .

పిఎంపి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆచంట

గ్రామీణ ప్రాంతాల్లో పిఎంపిలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. పిఎంపి డబ్ల్యూఎ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం వల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లూరు యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నరసాపురం సీత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన ఎమ్‌డి జనరల్ వైద్యులు గుబ్బల జితేంద్ర చైతన్య, డాక్టర్ అద్దంకి శివరామకృష్ణ, గైనకాలజిస్ట్ డాక్టర్ అద్దంకి విజ్ఞాని, గుండె వైద్య నిపుణులు జంధ్యాల సూర్య, చిన్నపిల్లల వైద్యాధికారి జిపిఎన్ అలేఖ్య, దంత వైద్యులు హేమంత్ మాధుర్ 176 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, ఎంపిటిసిలు ఆరుమెల్లి సుబ్బారావు, వైస్ సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉండి

పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం హెచ్‌ఎం రాజు మాట్లాడుతూ సోమవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఒంటి పూట బడులు ప్రకటించడంతో నేడు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. కలిగొట్ల పాఠశాల విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించేందుకు క్యాంపెయిన్ నిర్వహించి వారిని కూడా తమ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆహ్వానించామని తెలిపారు. పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అన్నదమ్ములకు వెలుగు చూపిన విశ్వ మానవవేదిక

మనోబంధు పౌండేషన్ సహకారంతో చికిత్స

ప్రజాశక్తి - పాలకొల్లు

అంబళ్ల నాగ వెంకటేష్, అంబళ్ల జగదీష్ అన్నదమ్ములు. పాలకొల్లులోని రామారావుపేటకు చెందిన వీరు చిరిగిన దుస్తులు, మాసిపోయిన జుట్టు, గెడ్డంతో ఉన్నారు. ఈ ఇద్దరు అన్నదమ్ములు మానసిక వ్యాధితో లోకం తెలియకుండా ఉంటున్నారు. వారు ఏం చేస్తున్నారో.. ఎలా ఉంటున్నారో వారికే తెలీదు. యుక్త వయసులో ఉన్న వారిద్దరూ మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. విషయం విశ్వమానవవేదిక దృష్టికి రావడంతో స్పందించిన విశ్వ మానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ భీమవరంలోని మనోబంధు ఫౌండేషన్ భూపతిరాజు రామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది క్రితం ఇద్దరిలో ఒకరిని విశాఖపట్నం, మరొకరిని తమిళనాడుకు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం పంపించారు. నేటికి వారు సాధారణ స్థితికి వచ్చారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. వారిద్దరికీ పూర్తిగా నయం అయ్యేవరకూ విశ్వ మానవవేదిక ద్వారా భోజనం అందించడానికి అధ్యక్షుడు మల్లుల సురేష్ ముందుకొచ్చారు. విశ్వమానవవేదిక నిత్యాన్నదానం 3,405వ రోజు వారిద్దరికి భోజనం ప్యాకెట్లు మానవతావాదులు బుద్ధరాజు, నడపన జగపతి చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో రామారావుపేట యువకులు గమిడి హేమంత్, కొప్పినీడి కళ్యాణ్‌కుమార్, మల్లేడి దేవిరాజ్, వీర మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ పాల్గొన్నారు.

జగన్నాథపురంలో తాగునీరు పునరుద్ధరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



పనులు పరిశీలిస్తున్న సర్పంచి చంద్రిక

జగన్నాథపురంలో ఎస్‌సిపేట, కొత్తకాలనీలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన లీకైన పైపులైను తొలగించి కొత్త లైన్ వేసి తాగునీరు సమృద్ధిగా అందించే ఏర్పాట్లు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజా శ్రీనివాస్ మూడు రోజుల పాటు గ్రామంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా హెచ్‌డిపి లైన్ వేయించే పనులు పర్యవేక్షించారు. యుపిఆర్‌డిఎం వెంకటేష్ ఆదేశాల మేరకు కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా తాగునీటి ట్యాంకర్లతో ప్రజలకు తాగునీరు అందించారు. త్వరలోనే గ్రామంలో కొత్త ట్యాంకు ప్రారంభిస్తామని సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక పేర్కొన్నారు.

వైసిపి హయాంలో టిడ్కో ఇళ్లు నాశనం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో భీమవరంలోని టిడ్కో ఇళ్ల పనులను పూర్తి చేయకుండా నాశనం చేసిందని ఎంఎల్‌ఎ అంజిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరంలో సుమారు 9,500 ఇళ్లు కట్టామని, 80 శాతం పూర్తి చేశామని, 20 శాతం మాత్రమే పూర్తి చేయాలని, వైసిపి ప్రభుత్వం ఎటువంటి పనులు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ప్రస్తుతం స్లాబ్‌లు లీకై, అద్దాలు పగిలిపోయాయని, ఈ ఐదేళ్లలో ఆ ఇళ్లను నాశనం చేసేశారని, రోడ్లు లేవని, మౌలిక సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. వీటిపై చర్యలు తీసుకోవాలని, 10 వేల మందికి సొంత ఇళ్లను ఏర్పాటు చేయాలని కోరారు.

నాట్ పోటీల్లో ఆదిత్య నేషనల్ ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి - భీమవరం టౌన్



విద్యార్థులను అభినందిస్తున్న లయన్ కృష్ణంరాజు

గత నెల 7వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నాట్ పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నేషనల్ ఫస్ట్ ర్యాంకు సాధించారని, రూ.25000 నగదు బహుమతి కూడా పొందారని ఆదిత్య స్కూల్ కరెస్పాండెంట్, లయన్ కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని ఎస్.వైష్ణవి నాగసాయి నేషనల్ ఫస్ట్ ర్యాంకు సాధించిందన్నారు. అలాగే టాప్‌టెన్‌లో అనేక ర్యాంకులు సాధించామన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో బియు వసుధ, కెవి.సత్యనారాయణ, ఉమా విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - తణుకు

జంక్ ఫుడ్ పూర్తిగా మానేసి వైద్యులు సూచించిన ఆహారం తీసుకోవాలని, వ్యాయామాలు పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ వంక రాజకుమారి సూచించారు. గురువారం పైడిపర్రు తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలోని వంకా సత్యనారాయణ, నాగమణి రీజనల్ డయాలసిస్ యూనిట్ సెంటర్‌లో వరల్డ్ కిడ్నీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ రోగులు ఎక్కువ మంది వస్తున్న నేపథ్యంలో అందరికీ చికిత్స అందేలా యూనిట్‌ను 10 బెడ్‌ల నుండి 15 బెడ్‌లకు విస్తరింపజేశామన్నారు. డయాలసిస్ యూనిట్ సెక్రటరీ బాబుజీరాబు మాట్లాడుతూ 2016 నవంబరు 12 నుండి 2025 ఫిబ్రవరి 28వ తేది వరకు తొమ్మిది సంవత్సరాలుగా రోగులకు అత్యున్నత సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ.1,95,94,680 బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. ఆర్థికంగా భారమైనా ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ కుటుంబం ఈ మొత్తం భరిస్తూ ఏలోటు లేకుండా యూనిట్‌ను సకల సౌకర్యాలతో నడుపుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. కేక్ కట్ చేసి వరల్డ్ కిడ్నీ డేను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం రోగులకు ఆపిల్స్, జామకాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి డాక్టర్ శారదాప్రసన్న, డాక్టర్ ధర్మతేజ, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ప్రసన్నకుమార్ ఉందుర్తి, ట్రెజరర్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కుడారి రజినీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

పెనుమంట్ర: శుక్రవారం పిఠాపురంలోని చిత్రాడ వేదికగా జరగనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేసే బాధ్యత మండలంలోని జనసేన నాయకులు, వీరమహిళ తీసుకోవాలని జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. యావత్ దేశం చూపు పిఠాపురం సభపై ఉందని తెలిపారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఈ సభకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

చోరీ కేసులో ఒకరు అరెస్టు

నరసాపురం: పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిలో ఒకరిని అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేస్తామని డిఎస్‌పి జి.శ్రీవేద తెలిపారు. గురువారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవేద మాట్లాడుతూ ఈ నెల స్టీమర్ రోడ్డు రామాలయం పక్కన నివాసం ఉంటున్న యర్రాప్రగడ వెంకట రత్నం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని వెండి వస్తువులు లేవు. దీంతో పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దొంగతనానికి పాల్పడిన ముగ్గురిలో ఒక్కరైనా హైదరాబాద్‌కు చెందిన సిడగం కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుండి సుమారు 5కేజీల వెండి వస్తువులు, బజాజ్ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిపై వివిధ పోలీస్ స్టేషన్లో 15 కేసులు ఉన్నాయన్నారు. ఈకేసులో ఉయ్యాల రాజేష్, యాలంగి కృష్ణ పరారీలో ఉన్నారని, వీరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ముద్దాయిని అరెస్టు చేయడంలో సిఐ బి.యాదగిరి, ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మహారాజశ్రీ VII వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫ్యామిలి కోర్టు, ప.గో.జిల్లా.

E.A.No.40/2024 in E.P.No.173/2023 in O.S.No.90/2016

Between :
చౌదాడ అంజలి అన్నపూర్ణ @ అన్నపూర్ణ
Rep by her SPA Holder గొర్రెల అరుణ ...క్లైయిమ్ పిటిషనరు
మరియు
నంగూలూరి సాంబ శివ సురేష్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు

To:
(రెస్పాండెంటు నెం.6)
బాలిబోయిన వెంకటేశ్వరరావు, S/o.సైదులు,
డోరునెం.7E-5-25/2, కత్తెపువీధి,
వెంకన్నచెరువు దగ్గర, ఏలూరు.

పై EP వారంటు గ్రంథములో, చౌదాడ అంజలి అన్నపూర్ణ @ అన్నపూర్ణ దాఖలు చేసిన EA 40/2024 నెంబరు గల క్లయిము పిటీషను EA 41/2024 నెంబరు గల Rule 32 of civil Rules of practice పిటిషను మరియు EA 42/2024 నెంబరు గల Stay పిటిషనులలో 6వ రెస్పాండెంటు అయిన బాలిబోయిన వెంకటేశ్వరరావు యొక్క హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు **ది.21-03-2025** తేదీకు వాయిదా వేసియున్నారు. పై పిటిషన్లు విషయమై సదరు 6వ రెస్పాండెంటుకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల వాయిదా రోజు **ఉదయం గం.10-30 ని॥లకు** పైకోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల వారి పరోక్షమున విచారించి, తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి అనుమతితో)

కె.నాగేంద్రబాబు,
అడ్వకేట్, ఏలూరు.
ఏలూరు
ది.11-03-2025 సెల్: 95054 58999

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెంటపాడు

జిల్లాలోని 2024లో అధిక వర్షాలు, ఎర్రకాలువ ముంపునకు గురై వేల ఎకరాలు పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని, ఈ నెల 15న ముఖ్యమంత్రి తణుకు వస్తున్న సందర్భంగా నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం, పరిహారం చెక్కులు అందించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు తదితర ప్రాంతాల్లో ఎర్ర కాలువ ముంపునకు గురై వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించి ఇప్పటికి నెలలు గడుస్తున్నా నేటికీ పరిహారం ఇవ్వలేదని రైతు సంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. రైతులకు పరిహారం అందకపోవడాన్ని ఇటీవల శాసనసభలో తణుకు, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎలు అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. అయినా ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు సమస్యను పట్టించుకోలేదని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ ప్రాంతానికి వస్తున్న సందర్భంగా రైతాంగాన్ని ఆదుకుంటారని నష్టపరిహారాన్ని అందిస్తారని రైతులందరూ ఎదురుచూస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలు గడుస్తున్నా నేటికీ రైతాంగాన్ని ఆదుకోలేదని తెలిపారు. ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగి వ్యవసాయం భారం అవుతున్న పరిస్థితుల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు జరిపి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఆక్వా సాగులో పేద, చిన్న రైతులు సీడ్ ఫీడ్ ధరల పెరుగుదల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. వారిని ఆదుకోవాలని కోరారు.

విలువలతో కూడిన కవిత్వం కవయిత్రి మొల్ల ప్రత్యేకం

ప్రజాశక్తి - భీమవరం

విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించడంలో కవయిత్రి మొల్ల ప్రత్యేకమని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ రామాయణాన్ని వివిధ భాషల్లో ఎందరో రచించారని, వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలో రచించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు: తెలుగులో మొల్ల రామాయణంగా రామాయణాన్ని రచించింది తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని తహశీల్దార్ కె.రాజుకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి అన్నారు. మొగల్తూరులోని భ్రమరాంబ సమేత వనమాలికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో వుడయారు సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ వారు మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు వుడయారు సంఘం ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. తహశీల్దార్ రాజు కిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, ఎస్ఎంఆర్ నాగేశ్వరరావు, కలిదిండి కుమార్‌బాబును సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘ సభ్యులు పొన్నపల్లి త్రినాథ్ వుడయార్, సఖినేటిపల్లి చిన్న, ఆదినారాయణ, వార్డు సభ్యురాలు పొన్నపల్లి శ్రీలక్ష్మీ మోహన్ అన్నారు.

పాలకొల్లు : క్షీరపురి శాలివాహన కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు. టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరినాయుడు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కర్నేన రోజారమణి, జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

తణుకు : శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), తణుకులో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.మారుతీదేవిచౌదరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారతీదేవిచౌదరి మాట్లాడుతూ ఆతుకూరి మొల్ల ఒక విశిష్టమైన కవయిత్రి అన్నారు. ఆమె రాసిన మొల్ల రామాయణం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే రచన అన్నారు. తెలుగు విభాగాధిపతి కనక మహాలక్ష్మీ మాట్లాడారు. కార్యక్రమంలో బిఎస్ఎల్ పద్మశ్రీ, కె.జీవన్‌బాబు, వి.శివప్రకాష్, బి.శిరీష, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) తణుకులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి అనిల్‌కుమార్ తెలియజేశారు. ఫిబ్రవరిలో మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని, 67 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఇ-ప్రోక్యూర్‌మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.700/2024/ఇ1 **ది.12-03-2025.**

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని **(1)** 12వ వార్డులోని యడ్ల బజారు వద్ద డా.APJ అబ్దుల్ కలామ్ హెల్త్ పార్కు (య.5.00 లు) Phase - II అభివృద్ధి చేయుటకు **(2)** 20వ వార్డు నందు గల బోండాడ వెంకట రాజు గుప్తా ఎన్‌టిఆర్ కళాక్షేత్రములో దామీజ్ షీటును గాల్వాల్యూమ్ రూఫ్ షీట్ పాలియురేతేన్ ఫోమ్ (PUF) షీట్‌తో పాటు నైట్రైల్ రబ్బరు ఇన్సులేషన్ షీట్‌తో రిప్లేస్మెంట్ చేయడం మరియు ఇతర పనులు చేయు నిమిత్తం (2 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు **రూ.1,41,28,600/-**లతో ఇ-ప్రోక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రోక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది.12-03-2025వ తేది సాయంత్రం గం.04.00 ని.ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రోక్యూర్‌మెంటు మార్కెటు **www.tender.apeprocurement.gov.in** లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమీషనరు
పాలకొల్లు పురపాలక సంఘం.